క్లుప్తంగా

శ్రీరాముని వెండి నాణెం కొనుగోలు



శ్రీరాముని వెండి నాణెం కొనుగోలు చేసిన హారిక

సీటీఆర్ఐ: రామ జన్మభూమి మందిర నిర్మాణ సందర్భంగా, కోల్‌కతాలోని భారత ప్రభుత్వ మింట్ 50 గ్రాముల శ్రీరాముని వెండి నాణేన్ని ముద్రించింది. దీని విలువ 5,300 రూపాయలు. నాణేనికి ఒకవైపు రాముని ప్రతిమ, రెండో వైపు అయోధ్య రామ మందిరం ముద్రించారు. తూర్పుగోదావరి జిల్లాలో తొలిసారిగా ఈ స్మారక వెండి నాణేన్ని వరదా హారిక అందుకున్నారు. ఈ వెండి నాణెం జిల్లాలో తొలిసారిగా తాను అందుకోవడం ఆనందంగా ఉందని తన సంతోషాన్ని వెల్లబుచ్చారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న విశ్వేశ్వరరెడ్డి తదితరులు

ప్రకాశం నగర్: తొమ్మిదవ మున్సిపాల్ కాలనీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం స్థానిక మున్సిపల్ కాలనీ క్రీడా మైదానంలో ముగిశాయి. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ 42వ వార్డు ఇన్‌చార్జి నామాని వాసు, కార్యదర్శి వజ్రనాథ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీకే మాట్లాడుతూ క్రికెట్ క్రీడను ప్రతి ఒక్కరూ ఎంచుకొని ఆడడం ద్వారా శరీరానికి వ్యాయామం, మనసుకు ఉల్లాసం, ఆహ్లాదం కలుగుతాయన్నారు. ఈ టోర్నమెంట్లో మొత్తం పది టీములు పాల్గొనగా, డేని కింగ్స్, రాజా వారియర్స్ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో డేని కింగ్స్ విజేతగా నిలిచింది. టీం సభ్యులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు ఆర్గనైజర్లుగా రఫీ, ఉమా, కోట వ్యవహరించారు.

పరిహారం చెల్లించకుండా చెట్ల నరికివేత

గోపాలపురం: కాలువలో భూములు కోల్పోయి వాటిలో ఉన్న చెట్లకు నష్టపరిహారం చెల్లించకుండా పొలంలో ఉన్న తాడిచెట్లు నరికివేశారంటూ ఓ రైతు వాపోయాడు. ఆయన వివరాల ప్రకారం.. గోపాలపురం మండలం గుడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతు సాగిరాజు అభిమన్యురాజు సుమారు 20 ఎకరాల భూమిని తాడిపూడి, చింతలపూడి కాలువ తవ్వకాలకు ఇచ్చారు.అందులో ఉన్న తాడిచెట్లు, ఇతర వేపచెట్లకు ప్రభుత్వం నష్టపరిహారం ఇంకా చెల్లించలేదు. అయితే రెండు రోజుల క్రితం విద్యుత్ శాఖ అధికారులు తమ విద్యుత్ లైన్లకు అడ్డొస్తున్నాయని సాకుతో అవసరం లేనిపోయినా సుమారు 70 తాడిచెట్లు నరికివేసినట్లు రైతు అభిమన్యురాజు వాపోయారు. వాటిని నరికివేయడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారాన్ని కోల్పోయానని విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో గుడ్డిగూడెం లైన్‌మెన్, భీమోలు లైన్‌మెన్లు కలసి నానా దుర్భాషలు ఆడినట్లు రైతు తెలిపారు. అవసరం లేకుండా నరికిన తాడిచెట్లు ముక్కలు చేసి వ్యాపారం చేసుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై ఎలక్ట్రికల్ ఏడీఈ కె.రవిశంకర్‌ను వివరణ కోరగా రైతుతో గొడవ పడిన విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేసి రైతుకు న్యాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక ఆల్‌కట్‌గార్డెన్స్‌కు చెందిన యువతి (18) ఈ నెల 14 నుంచి తన కనిపించడంలేదంటూ ఆమె తల్లి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తల్లి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

యోగాభాగ్యాలు

- రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడుసార్లు విజేత
- జాతీయ స్థాయిలోనూ రాణిస్తున్న సాత్త్విక

ప్రకాశం నగర్: కేవలం ఐదేళ్ల ప్రాయంలోనే యోగా సాధనలో అడుగు పెట్టిన సాత్విక మూడుసార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకుని గోల్డ్‌మెడల్ సాధించింది. నగరానికి చెందిన సాత్విక ప్రస్తుతం ఒక ప్రయివేట్ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు అరుణ, దామోదర్‌ల ప్రోత్సాహంతో చదువుతోపాటు యోగాలో శిక్షణ తీసుకుంటున్న చిన్నారి యోగాలో కోచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో పలు కఠినమైన ఆసనాలను అవలీలగా వేసి అందరినీ ఆకట్టుకుంటోంది. 12 ఏళ్ల ప్రాయంలోనే యోగాలో ఇంతటి ప్రతిభ చూపిన సాత్వికను కలెక్టర్ కె.మాధవీలత అభినందించారు. చెన్నైలో జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్‌లో ప్రధాని నరేంద్రమోదీ ముందు పూర్ణశలభాసనాన్ని 180 సెకండ్ల పాటు వేసి ఆయన ప్రశంసలు అందుకుంది. వీటితోపాటు 200 మంది యోగా క్రీడాకారులతో గిన్నిస్ వరల్డ్ రికార్డు మాస్ ఈవెంట్‌లోను అలరించింది.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

2022లో స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో, నేషనల్ యోగసనా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో ప్రథమ స్థానం, 2023లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో వరుసగా మూడుసార్లు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించింది. మహారాష్ట్ర, పంజాబ్, తమిళనాడులో జరిగన జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొని తన సత్తాను చాటింది. భారత్ స్కాట్‌లో విద్యార్థినిగా ఉన్న సాత్విక ఇటీవల రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో అమృత్ స్టేషన్ పథకంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో పలు యోగసనాలు వేసి అందరి ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా యోగసనాలలో బ్యాక్ బెండ్, ట్విస్టింగ్ వంటి ఆసనాలతో చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



ట్విస్టింగ్ ఆసనం

మరింత శిక్షణ ఇస్తాం

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో మూడుసార్లు విజేతగా నిలిచిన సాత్విక, జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించేందుకు అవసరమైన శిక్షణ ఇస్తాం. అండర్ -8 నుంచి ,అండర్ -17 విభాగాల్లో సుమారు 15 మంది చిన్నారులకు యోగాలో శిక్షణ ఇస్తున్నాను.

– శ్రీనివాస్, యోగా శిక్షకుడు



యోగాలో సత్తా చాటిన సాత్వికను అభినందిస్తున్న కలెక్టర్ మాధవీలత



బ్యాక్ బెన్డ్ ఆసనం

టీడీపీ, జనసేనల నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన యువతతో ఎంపీ భరత్‌రామ్

యువతను స్వాగతించిన ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: కమీషన్లు తీసుకునే సంస్కృతి ఆదిరెడ్డి కుటుంబానిదని అదే దృష్టితో చూడటం వల్ల నాపై బురదజల్లుతున్నారని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్ ప్రాంగణంలో స్థానిక 2, 3, 9 వార్డులకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సుమారు 80 మంది యువత వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ నగర యువజన విభాగం అధ్యక్షుడు పీతా రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరిన యువకులకు భరత్‌రామ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోలా బెదిరిస్తే భయపడి ఓట్లువేసే రోజులు పోయాయని ప్రజల్లో చైతన్యం వచ్చిందన్నారు. ఎవరికి ఓటు వేస్తే అభివృద్ధి జరుగుతుందో ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారన్నారు. టీడీపీ నేతలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా చివరికి వైఎస్సార్ సీపీదే విజయమన్నారు. పనుల్లో 25 శాతం కమీషన్ తీసుకుంటున్నట్టు టీడీపీ ఆదిరెడ్డి కుటుంబం ఆరోపిస్తోందని అంటే అభివృద్ధి పనులు జరిగినట్టు అంగీకరిస్తున్నట్టే కదా అన్నారు. ఇక కమీషన్ల విషయానికొస్తే 25 శాతం కాదు ఒక్క శాతం కమీషన్ తీసుకున్నట్టు రుజువు చేస్తే దేనికైనా సిద్ధమేనని సవాల్ విసిరారు. 16 సంవత్సరాల పాటు మేయర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవులు అనుభవించిన ఆదిరెడ్డి కుటుంబం నగరానికి చేసిన ఒక్క అభివృద్ధి పని చెప్పాలన్నారు. అభివృద్ధి చేశానని అనిపిస్తేనే ఓటు వేయమని ప్రజలను కోరుతున్నానన్నారు. జగనన్న పాలనపై పూర్తి భరోసా ఉండబట్టే టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ అబ్జర్వర్ రావిపాటి రామచంద్రరావు, రాష్ట్ర గాండ్ల తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీదే విజయం

పార్టీ రాష్ట్ర దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు కిరణ్‌రాజ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాబోయే ఎన్నికలలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ మళ్లీ ఘనవిజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్ అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ నుంచి గౌరీపట్నం మేరీమాత ఆలయం వరకు త్రీవీలర్ వాహనాలు, ఆటోలలో దివ్యాంగులు 'జగనన్న వన్స్‌మోర్ 'అనే నినాదాలతో వెళ్లారు. మేరీమాత ఆలయం వద్ద 101కొబ్బరికాయల కొట్టి రాబోయే ఎన్నికలలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బందెల కిరణ్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ మాట్లాడుతూ జిల్లాలో పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, అసెంబ్లీ అభ్యర్థులు మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, డాక్టర్ తానేటి వనిత, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడిరాజా, ఎంపీ మార్గానిభరత్‌రామ్, ఎమ్మెల్యేలు తలారి వెంకటరావు, జి.శ్రీనివాసనాయుడు, డాక్టర్ సత్తిసూర్యనారాయణ రెడ్డి ఘనవిజయం సాధించాలని ఆమేరీమాతను వేడుకున్నామన్నారు. దివ్యాంగుల సెల్ నాయకులు సబ్బెళ్ల విజయదుర్గారెడ్డి, కె.వి.ఆర్.సాగర్, రజినికుమార్, పుష్కర సత్యనారాయణ పాల్గొన్నారు.



మేరీమాత ఆలయం వద్ద మాట్లాడుతున్న కిరణ్‌రాజ్

'పది' పరీక్షలు రాయనున్న 1,019 మంది

కడియం: మండలం పరిధిలోని ఆరు కేంద్రాల్లో మొత్తం 1,019 మంది పదవ తరగతి పరీక్షలు రాయనున్నారని మండల విద్యాశాఖాధికారులు ఎంఎస్ మణికుమార్, వై.నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది కొత్తగా జేగురుపాడు ఉన్నత పాఠశాలకు పదవ తరగతి పరీక్షా కేంద్రం కేటాయించారని వారు తెలిపారు. కాగా వేమగిరి జిల్లా పరిషత్ హైస్కూలు, కడియపులంక, కడియం, మురమండ, వీరవరం ఉన్నత పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాస్తారన్నారు. మండలంలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 523 మంది బాలురు, 496 మంది బాలికలు పరీక్షలు హాజరవుతారని వారు తెలిపారు. నిర్ణీత సమయానికంటే ముందే పరీక్షలకు హాజరు కావాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని సదుపాయాలు ఉండే విధంగా చర్యలు చేపట్టామన్నారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు కూడా ఉంటాయని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రకాశం నగర్ : హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ, బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బస్‌స్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీఐ అజయ్‌బాబు, అసిస్టెంట్ డిపో మేనేజర్ ఎం.త్రిమూర్తులు, ఏఎస్ఐ రామకృష్ణ , డాక్టర్ దుర్గాప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ హెల్ఫర్ సొసైటీకి అభివృద్ధి కృషి చేస్తున్న మహిళలకు ఉత్తమ మహిళ అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బాలకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికలలో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులందరూ ఎన్నికల నియమావళికి బద్ధులై ఉండాలని కమిషనర్ కె.దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతి లేని హోర్డింగ్స్, బోర్డులు, పోస్టర్స్, ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలని సిబ్బందినిఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులపై ఎటువంటి బోర్డులు, పోస్టర్స్ ఉండరాదని, మహాత్మాగాంధీ, డాక్టర్ అంబేడ్కర్ వంటి జాతీయ స్థాయి నేతల విగ్రహాలు తప్ప ఇతర విగ్రహాలన్నింటికి ముసుగులు వేయాలన్నారు. అభ్యర్థులు ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించే సమయంలో ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ టీములు, వీడియో సర్వైలెన్స్ టీములు, ఇతర బృందాలు నగరంలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు ప్రవర్తనా నియమావళి అమలును పర్యవేక్షిస్తాయన్నారు. రాజమహేంద్రవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి, నగరపాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై ఫోన్ 94940 60060 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చున్నారు. నగరపాలక సంస్థ ఫేస్ బుక్, ట్విటర్ (ఎక్స్), ఇన్‌స్టాగామ్‌కు టాగ్ చేయవచ్చన్నారు. వాటితో పాటు ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన సి-విజిల్ యాప్ ద్వారా కూడా ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చనని తెలిపారు. నగరంలో అనుమతి లేని హోర్డింగులు, బోర్డులు తదితర ప్రచార సామగ్రిని తొలగించే కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు. సిటీ ప్లానర్ జె.సూరజ్‌కుమార్, ఎన్నికల ప్రవర్తనావళి పర్యవేక్షక బృందాలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బోర్డులు తొలగింపును పర్యవేక్షిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

వైభవంగా మహాచండీ హోమం

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలో గల ఒనువులమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ గోవిందరాజుల వెంకట శాస్త్రి, ఆయన శిష్య బృందం ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, చండీ మంటప ఆరాధనతో ప్రారంభమైంది. 13 నదుల నుంచి తెచ్చిన నదీ జలాలతో, 13 రకాల ద్రవ్యాలతో పంచామృతాలతో ఉత్సవ మూర్తులకు అభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, భక్తుల జయ జయ ధ్వానాలు పూర్ణాహుతితో చండీహోమం ముగిసింది. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ వెంకట శాస్త్రి మాట్లాడుతూ చండీహోమాలు ఎక్కువగా శక్తి పీఠాలలో నిర్వహిస్తారని, మానవాళి శ్రేయస్సు, గ్రామం శ్రేయస్సు కోసం అమ్మవారి ఆలయం ప్రాంగణంలో చండీహోమం నిర్వహించడం అభినందనీయమన్నారు. హోమంలో భక్తులుపాల్గొని పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



ఒనువులమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న వెంకటశాస్త్రి

పీఎంపీలకు అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: మహిళలకు వచ్చే వ్యాధులపై పీఎంపీలకు అవగాహన ఎంతో అవసరం అని ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ మాధురి దేవి సముద్రాల అన్నారు. ఆదివారం కమ్యూనిటీ పారామెడిక్స్-ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) ఆధ్వర్యంలో హుకుంపేటలో గోదావరి రుచులు కాన్ఫరెన్స్‌హాల్లో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు రాజమండ్రి శాఖ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సదస్సులో డాక్టర్ మాధురి'స్ విమెన్స్ క్లినిక్ గైనకాలజిస్ట్ డాక్టర్ మాధురి దేవి మాట్లాడుతూ స్త్రీలు ఇబ్బంది పడే వ్యాధులను ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స అందించడంతో పాటుగా వ్యాధి గురించి తగు జాగ్రత్తలు తెలిపాలన్నారు. మోనోపాజ్ సమయంలో మహిళలు పడే ఇబ్బందులు గురించి, చేసే అధునాతన చికిత్సల గురించి వివరించారు. వృద్ధాప్యంలో స్త్రీలకు వచ్చే వ్యాధులపై ఆదరణతో కూడిన వైద్య సేవలందించాలని సూచించారు. రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ పీఎంపీలకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని, వీటి వల్ల మేలైన సేవలందించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు.ప్రసాద్‌బాబు, ఏ.సురేష్ బాబు, కేవీఎస్ఎన్ రెడ్డి, సుంకర శ్రీనివాస్, ఎం.బాపూజీలతో పాటు సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం డాక్టర్ మాధురి దేవిని సభ్యులు సత్కరించారు.



డాక్టర్ మాధురిదేవిని సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

20 నుంచి మదనగోపాల స్వామి కల్యాణ మహోత్సవం



ఆలయం వద్ద ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: తాళ్లపూడిలోని రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 20వ తేదీ నుంచి 22 తేదీ వరకూ నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించింది. ఈ సందర్భంగా ఆదివారం మదన గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, వ్యాపారవేత్త సింహాద్రి జనార్దనరావు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. 20న రుక్మిణి సత్యభామ సహిత మదన గోపాల స్వామి కల్యాణోత్సవం, 21న రథోత్సవం, 22న భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ తెలిపింది. గ్రామస్తులందరిని సహకారంతో కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో నక్కా చిట్టిబాబు, బొర్రా శ్రీరామచంద్ర మూర్తి, అప్పన రాజా, కుసు ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

సీతానగరం: తమ పదవ తరగతి పరీక్ష హాల్ టిక్కెట్ చూపిస్తే ఆర్టీసీ బస్‌లో విద్యార్థులు ఉచితంగా ప్రయాణించవచ్చని ఎంఈఓ కె.స్వామినాయక్ తెలిపారు. ఆదివారంవిలేకరులతో మాట్లాడుతూ మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్ సెంటర్‌లో 120 మంది హాజరవుతారని తెలిపారు. చినకొండేపూడి సూర్యచంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 220మంది, రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో 240 మంది, వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో 250 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరు అవుతారని తెలిపారు. మొత్తం 830 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఎంఈఓ స్వామినాయక్ తెలిపారు.

కాపుల సమావేశాన్ని విజయవంతం చేయాలి

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీలోని కాపు నాయకులంతా ఏక తాటి పైకి వచ్చి పార్టీ విజయానికి కృషి చేయడంతో పాటు భవిష్యత్ కార్యచరణపై దృష్టి సారిస్తున్నట్టు మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు(అబ్బులు) తెలిపారు. తాళ్లపూడి మండలంలోని కాపు నాయకులను ఆదివారం బండి అబ్బులు, మైపాల రాంబాబు, తోట రామకృష్ణ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా బండి అబ్బులు మాట్లాడుతూ 18వ తేదీన కొవ్వూరులోని మైపాల రాంబుబు ఫైబర్ నెట్ ఆఫీస్ వద్ద నియోజకవర్గ స్థాయి కాపు నాయకుల సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశానికి కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావును కూడా ఆహ్వానించారన్నారు. నియోజక వర్గంలోని కాపు నాయకులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. కాపు జేఏసీ నాయకులు తోట రామకృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని బలపరిచేలా కాపు అందరు కలిసికట్టుగా ముందుకు రావాలన్నారు. కాపులకు సముచిత గుర్తింపు వచ్చేలా, మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు మైపాల రాంబాబు, వల్లభశెట్టి శ్రీనివాస్, నామా ప్రకాశం, కొమ్మిరెడ్డి పరశురామారావు, గనిశెట్టి బంగారురాజు, వనిమిరెడ్డి శ్రీనివాస్, సిద్ధంశెట్టి కృష్ణ, బండ్రెడ్డి సత్యనారాయణ తదితరులున్నారు.

ప్రజాసేవే లక్ష్యం

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- కోరుకొండలో గడప గడపకూ వైఎస్సార్ సీపీ సందడి

మధురపూడి: ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా స్థానికులను కోరారు. ఆదివారం మండల కేంద్రమైన కోరుకొండలో గడప గడపకూ మన వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు ఫిల్మ్‌నగర్‌లో ప్రారంభమైన కార్యక్రమం రాత్రి 8 గంటల వరకూ సాగింది. సాయంత్రం నుంచి రాత్రి వరకూ 550 గడపల కెళ్లి ప్రతీ ఒక్కర్నీ పలకరిస్తూ సంక్షేమ పథకాలందుతున్న తీరుపై ఆరా తీశారు. తొలుత పార్టీ జెండా ఆవిష్కరణ చేసిన తర్వాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అవినీతికి తావులేకుండా అర్హతగల ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. సంక్షేమ పథకాలందించడం ద్వారా ప్రజలకు ఆర్థిక భరోసా ఏర్పడిందన్నారు. జగనన్న పట్ల ప్రజలు మంచి ఆదరాభిమానాన్ని చూపుతున్నారని, రాష్ట్రంలో 175 నియోజకవర్గాలను కై వసం చేసుకోవాలనే లక్ష్యంతో ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.



కోరుకొండ ఫిల్మ్‌నగర్‌లో గడప గడపకూ మన వైఎస్సార్ సీపీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజా

గౌతమి గ్రంథాలయ ఆవరణలో స్వచ్ఛభారత్

ప్రకాశం నగర్ : ఆదిత్య డిగ్రీ కళాశాల, ఆదిత్య డిగ్రీ స్త్రీల కళాశాల ఎన్ఎస్ఎస్ అండ్ యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సభ్యులతో కలిసి స్థానిక గౌతమి గ్రంథాలయంలో స్వచ్ఛ భారత్, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు లైబ్రరీ ఆవరణలో చెత్త, కలుపు మొక్కలను తొలగించారు. ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో 12 అడుగుల మామిడి మొక్కలను నాటారు. ఎన్ఎస్ఎస్ పీవో జీవీఎస్ నాగేశ్వరరావు, ఎఫ్ఎస్ఎస్ సభ్యులు కె.సుధాకర్ పట్నాయక్, పీవీఎస్ కృష్ణారావు, చందనరాజు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జవహర్‌కు కొవ్వూరు సీటు కేటాయించాలి

సీటీఆర్ఐ: తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేసిన మాజీ మంత్రి కేఎస్‌జవహర్‌కు కొవ్వూరు ఎమ్మెల్యే సీటు కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గానికి తెలుగుదేశం పార్టీని పరిచయం చేసింది మాజీ మంత్రి కేఎస్‌జవహర్ అని తెలిపారు. అగ్రవర్ణాల పెత్తందారులు చేసిన కుట్ర ఫలితంగానే కొవ్వూరు సీటు కేటాయింపులు కేఎస్ జవహర్‌కు అన్యాయం జరిగిందని అన్నారు.

20న విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

రంగంపేట: మండలంలోని వడిశలేరులో కొలువైన అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఈనెల 20న నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సత్తి సత్తిబాబు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బుధవారం ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులంతా స్వామిని దర్శించి కల్యాణ వేడుకలను తిలకించాలని కోరారు.

సేవలు అభినందనీయం

ధవళేశ్వరం: డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన నేమాని మెహర్ స్మరణ్ సేవలు అభినందనీయమని పద్మశాలి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నీలం వీరవెంకటసత్యనారాయణ(బాబ్జీ) పేర్కొన్నారు. క్వాలిటీ కంట్రోల్ సూపరింటెండెంట్ నుంచి డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా బాబ్జీ పదోన్నతి పొందిన సందర్భంగా ఆదివారం ఘనంగా సన్మానించారు. రాజమహేంద్రవరం పద్మశాలి అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ఎన్నికలు అయ్యేంత వరకూ స్పందన రద్దు

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమం ఎన్నికలు పూర్తి అయ్యేంత వరకూ రద్దు చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ ఆదివారం ప్రకటించారు. దీనితో పాటు సచివాలయాల్లో సైతం స్పందన రద్దు చేశామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

సినిమాలు

శ్యామల	: భీమా
సూర్యమినీ	: బస్తర్,యోధా
సూర్యప్యాలెస్	: కుంగ్‌ఫూపాండా-4
స్వామి	: వెయ్‌దరువెయ్
శివజ్యోతి	: హనుమాన్
అనుశ్రీ	: ప్రేమలు
రాజా	: రజాకార్
ఊర్వశి	: రజాకార్
రంభ	: తంత్ర
మేనక	: లంబసింగి, షరతులువర్తిస్తాయి
అప్సర	: గామి
కుమారి	: మాయ, ప్రేమలు
నామవరం	
వీఎస్.మహల్	: రజాకార్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: ప్రేమలు